స్కాలర్‌షిప్‌ల రద్దుతో పేదవిద్యార్థులు చదువుకు దూరం

- కేంద్రం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నుంచి ఆరు నుంచి ఎనిమిదో తరగతిలోపు ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ, ఐబిసి పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను ఇవ్వబోమంటూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రకటించడం సరైందికాదని సిపిఎం రాష్ట్ర కమిటీ విమర్శించింది. తక్షణమే ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలంటూ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పేద విద్యార్థులకు ఇస్తున్న స్కాలర్‌షిప్‌లు వారి చదువుకు ఎంతో కొంత ఉపశమనంగా ఉంటున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉచిత నిర్బంధ విద్యను సాకుగా చూపి కేవలం తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకే ఈ స్కాలర్‌షిప్‌లను పరిమితం చేసే విధంగా కేంద్రం కుట్ర పన్నిందని విమర్శించారు. దీని వల్ల ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ, ఐబిసి విద్యార్థులు చదువులకు దూరమై డ్రాపౌట్స్ పెరిగే ప్రమాదముందని హెచ్చరించారు.

తెలంగాణ శశికళగా మారిన కవిత : బక్క జడ్సన్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలంగాణ శశికళగా మారారని పిసిసి ప్రధాన కార్యదర్శి బక్క జడ్సన్ ఎద్దేవా చేశారు. ఢిల్లీ లిక్కర్ స్కాం రిమాండ్ రిపోర్ట్‌లో ఆమె పేరు ప్రస్తావనకు వచ్చిన నేపథ్యంలో కవిత మాట్లాడిన తీరుకు ఆయన ఒక ప్రకటనలో ఖండించారు. కవిత అవినీతికి పాల్పడ్డారనీ, మద్యం కుంభకోణంలో ఆమె పేరును సిబిఐ ప్రస్తావించిందని తెలిపారు. లైగర్ సినిమా పెట్టుబడుల ద్వారా ఆమె అక్రమంగా సంపాదించారని ఆరోపించారు. అయితే ఈ విషయంలో తెలంగాణ సెంటిమెంట్ తీసుకురావడం సరికాదని గుర్తు చేశారు. కల్వకుంట్ల కుటుంబ అవినీతిని ఆమోదించే పరిస్థితుల్లో తెలంగాణ ప్రజలు లేరని హెచ్చరించారు. కాళేశ్వరం, మిషన్ భగీరథ వంటి ప్రాజెక్టుల్లో నెలకొన్న అవినీతిపై తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

కాన్పు చేశారు.. కడుపులో దూది మరిచారు..!

నల్లగొండ జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఆలస్యంగా వెలుగులోకి..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అధికారుల అలసత్వం, వైద్యాధికారుల నిర్లక్ష్యం మరోసారి బయటపడింది. మహిళకు ఆపరేషన్ చేసి కాన్పు చేసిన డాక్టర్లు కడుపులో దూది పెట్టి కుట్లు వేశారు. ఈ ఘటన నల్లగొండ జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి.. గత నెల 14న దేవరకొండ మండలం కొమ్మెపల్లికి చెందిన శిరీషను రెండో కాన్పు కోసం నల్లగొండ జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. 17న డాక్టర్లు ఆపరేషన్‌తో కాన్పు చేయగా పాప పుట్టింది. అప్పటి నుంచి శిరీషకు తీవ్ర రక్తస్రావం, జ్వరంతో బాదపడుతున్నా 24న డిశ్చార్జ్ చేశారు. శిరీషకు తరచూ కడుపునొప్పి వస్తుండటంతో కుటుంబ సభ్యులు బుధవారం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. డాక్టర్ ఆమెకు స్కానింగ్ తీయగా కడుపులో దూది ఉన్నట్టు గుర్తించారు. ఈ విషయం తెలుసుకున్న శిరీష కుటుంబ సభ్యులు, బంధువులు ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆపరేషన్ సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

కొత్త మెడికల్ కాలేజీలకు 3,897 పోస్టులు

- ఒక్కో కాలేజీ, అనుబంధ హాస్పిటల్‌కు 433 పోస్టుల మంజూరు
- ఆర్థికశాఖ ఉత్తర్వులు జారీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జిల్లాకొక మెడికల్ కాలేజీని ఏర్పాటు చేస్తూ వైద్యంతో పాటు వైద్య విద్యను పటిష్టం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలో కొత్తగా ఏర్పాటు చేయబోయే మరో తొమ్మిది మెడికల్ కాలేజీలకు 3,897 పోస్టులు మంజూరు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఒక్కో మెడికల్ కాలేజీకి వివిధ కేటగిరీల్లో కలిపి 433 పోస్టులను మంజూరు చేసింది. రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి, వికారాబాద్, ఖమ్మం, కరీంనగర్, జయ శంకర్ భూపాల పల్లి, కొమరం భీం ఆసిఫాబాద్, జనగాం, నిర్మల్ మెడికల్ కాలేజీలకు, వీటి అనుబంధ ఆస్పత్రుల కోసం ప్రభుత్వం పోస్టులు ఏర్పాటు చేసింది. రాష్ట్ర ఏర్పాటు తర్వాత ప్రారంభించిన 12 మెడికల్ కాలేజీలు సహా, కొత్తగా ఏర్పాటు చేయబోయే తొమ్మిది మెడికల్ కాలేజీల కోసం ఇప్పటి వరకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలో మొత్తం 15,476 పోస్టులు మంజూరు చేసింది.

ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యంతో పాటు, విద్యను చేరువ చేయాలనే లక్ష్యంతో జిల్లాకు ఒక మెడికల్ కాలేజీని ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. ఉమ్మడి రాష్ట్రంలో కేవలం ఐదు మెడికల్ కాలేజీలు మాత్రమే ఉంటే, రాష్ట్రం ఏర్పడిన వెంటనే సిఎం కెసిఆర్ మహబూబ్‌నగర్, సిద్ధిపేట, నల్లగొండ, సూర్యాపేటలో నాలుగు మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేశారు. ఆ తర్వాత మరో ఎనిమిది మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేశారు. తద్వారా ప్రభుత్వ మెడికల్ కాలేజీల సంఖ్యను ఎనిమిదేళ్లలో ఐదు నుంచి 17కు పెంచారు. ఇందులో భాగంగా ఈ ఏడాది నవంబర్ 15న రాష్ట్ర వ్యాప్తంగా ఎనిమిది మెడికల్ కాలేజీలను ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రారంభించిన సంగతి తెలిసిందే. దీంతో అదనంగా 1,150 మెడికల్ సీట్లు అందుబాటులోకి వచ్చాయి. 2014లో ప్రభుత్వ కాలేజీల్లో 850గా ఉన్న ఎంబిబిఎస్ సీట్లు, ఈ ఏడాదికి 2,790కి పెరిగాయి. జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఉండాలనే లక్ష్యంలో భాగంగా, వచ్చే ఏడాది మరో తొమ్మిది మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసేందుకు సర్కారు చర్యలు తీసుకుంటోంది.

ఆరోగ్య తెలంగాణ దిశగా తెలంగాణ అడుగులు -మంత్రి హరీశ్ రావు, ఆర్థిక, వైద్యారోగ్య మంత్రి

అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో నాణ్యమైన వైద్యం, వైద్యను అందించే లక్ష్యంలో ఇదొక ముందడుగు. ముఖ్యమంత్రి కెసిఆర్ నాయకత్వంలో రాష్ట్రం ఆరోగ్య తెలంగాణ దిశగా వేగంగా అడుగులు వేస్తోంది. కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటుతో ఒకవైపు నాణ్యమైన వైద్యం, మరో వైపు వైద్యవిద్య రాష్ట్ర ప్రజలకు చేరువవుతుంది. నాడు పెద్ద పట్టణాలకు మాత్రమే పరిమితమైన స్పెషాలిటీ వైద్యం జిల్లాకొక మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తుండటంతో గ్రామీణ ప్రజలకు చేరువైంది. తద్వారా పేదలకు సమీపంలోనే ఉచితంగా నాణ్యమైన వైద్య సేవలు అందుతుండటంతో పాటు వైద్యం కోసం చేసే ఆర్థిక భారం నుంచి ఉపశమనం లభిస్తుంది. మరోవైపు డాక్టర్ కావాలని కలలుకనే విద్యార్థులకు, స్థానికంగా ఉంటూనే వైద్య విద్యను అభ్యసించే అవకాశాలు మెరుగుపడ్డాయని ..... హరీశ్ రావు ట్వీట్ చేశారు.

అదంతా తప్పుడు ప్రచారం

- పంజాబ్, హర్యానా రైతులకు నగదు చెల్లింపులు
- సిఎస్ సోమేశ్‌కుమార్ వివరణ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

దేశ రైతాంగ పోరాటంలో అసువులు బాసిన పంజాబ్, హర్యానా రాష్ట్రాలకు చెందిన 709 రైతు కుటుంబాలకు సిఎం కెసిఆర్ ఈ ఏడాది మే 22న 1010 చెక్కులను పంపిణీ చేశారని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ గుర్తు చేశారు. ఆ చెక్కులు నగదు రూపంలోకి మారడం లేదంటూ కొన్ని మీడియా సంస్థలు వాస్తవాలు తెలుసుకోకుండా తప్పుడు వార్తలను ప్రసారం చేస్తున్నాయని ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తం 1010 చెక్కుల్లో 814 చెక్కులకు నగదు చెల్లింపులు ఇప్పటికే జరిగాయని తెలిపారు. బ్యాంకు నిబంధనల మేరకు, నిర్దేశిత మూడు నెలల సమయం లోపల ఆయా చెక్కులను బ్యాంకుల్లో డిపాజిట్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ విధంగా చేయకపోవడం వల్ల మిగిలిన కొన్ని చెక్కులకు నగదు చెల్లింపులు జరగలేదనే విషయం తమ పరిశీలనలో తేలిందని పేర్కొన్నారు. ఇది చెక్కులను నిర్దేశిత సమయంలో డిపాజిట్ చేయకపోవడం వల్ల జరిగిన సాంకేతిక పొరపాటే తప్ప మరోటికాదని వివరించారు. సంబంధిత బ్యాంకులకు గడువుదాటిన తర్వాత డిపాజిట్ చేసినట్టు చెబుతున్న మిగిలిన చెక్కులకు మరికొంత సమయం ఇచ్చి, నగదు చెల్లింపులు జరిగేలా అనుమతిని కోరారు. ప్రభుత్వం ఇప్పటికే రీవాలిడేట్ చేయాలంటూ ఆయా బ్యాంకులను కోరినట్టు తెలిపారు. ఈ విషయానికి సంబంధించి మరింత సహాయం కోసం ప్రభుత్వ జాయింట్ సెక్రటరీ (రెవెన్యూ డిపార్ట్ మెంట్) రాంసింగ్‌ను 9581992577 నెంబరులో సంప్రదించాలని కోరారు. రైతులకు ఆర్థిక సహాయం అందేదాకా తెలంగాణ ప్రభుత్వం సహకారాన్ని అందిస్తుందని భరోసా ఇచ్చారు.

సిఎస్‌తో గోవింద్‌సింగ్ భేటీ

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్‌తో రిటైర్డ్ ఐపిఎస్ గోవింద్‌సింగ్ గురవారం భేటీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత సిఎస్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. సిఐడి డిజిపిగా ఇటీవల ఆయన పదవీ విరమణ చేశారు. ఆయన్ను ఎంక్వయిరీస్ కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే.

ఈశ్వరీబాయి స్ఫూర్తిదాయకం

- నివాళులర్పించిన సిఎం కెసిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దళితులు,అణగారిన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా జీవితాంతం కృషి చేసిన ధీశాలి ఈశ్వరీబాయి అని ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు అన్నారు. ఈశ్వరీబాయి జయంతి పురస్కరించుకొని గురువారం ఆమెకు కెసిఆర్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ నాయకురాలిగా, సామాజికవేత్తగా, తెలంగాణ కోసం పోరాడిన ఉద్యమకారిణిగా ఆమె సాగించిన సాహస పోరాటాన్ని కొనియాడారు. స్త్రీకి స్వేచ్ఛ కరువైన నాటి కాలంలో ఈశ్వరీబాయి ఒక దళిత మహిళగా పోరాట స్ఫూర్తిని ప్రదర్శిస్తూ, అత్యున్నత శిఖరాలను అధిరోహించిన తీరు నేటి మహిళా లోకానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. తెలంగాణ గర్వించే బిడ్డగా ఆమె అనుసరించిన విలువలు స్ఫూర్తిని రేపటి తరానికి అందించాలనే లక్ష్యంతో, గత పాలనలో విస్మరించబడిన ఈశ్వరీబాయి జయంతిని రాజకీయాలకు అతీతంగా తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని తెలిపారు. ఈశ్వరీబాయి వంటి ప్రజాస్వామిక వాదుల ఆశయాల ప్రేరణతో, తెలంగాణ ప్రభుత్వం దళిత సాధికారతను సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతోందన్నారు. ఆమె స్ఫూర్తితో తెలంగాణ ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని సిఎం అన్నారు. దళితుల ఆర్థిక సామాజిక ఆత్మగౌరవాన్ని ద్విగుణీకృతం చేసే దిశగా, వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించే దిశగా, తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న 'దళిత బంధు' పథకం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. దళిత బహుజన, మహిళలు, పేదలు, అణగారిన వర్గాల ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలనను కొనసాగించాలనే స్పృహను యావత్ దేశంలోని పాలక వ్యవస్థకు కలిగించేందుకే తెలంగాణ సచివాలయానికి డా. బిఆర్ అంబేద్కర్ పేరు పెట్టుకున్నామని, 125 అడుగులతో,దేశంలోనే అత్యంత ఎత్తయిన అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుంటున్నామని సిఎం అన్నారు. ఈ దిశగా తెలంగాణ ప్రభుత్వం దేశానికి ప్రేరణగా నిలుస్తోందని కెసిఆర్ తెలిపారు.

మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీతో తడిసిన ధాన్యం

బాధిత రైతులను ఆదుకుంటాం : ఎమ్మెల్యే పెద్ది

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆరుగాలం కష్టించి పండించిన రైతులకు మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ వల్ల రోధనే మిగిలింది. వివరాల్లోకి వెళ్తే.. వరంగల్ జిల్లా ఖానాపురం మండల కేంద్రంలో ఎడ్ల జగన్మోహన్ రెడ్డి, తూడి ప్రతాపరెడ్డి, కామిశెట్టి గాంధీ, వెంపాల వెంకటరెడ్డి సంబంధించిన సుమారు పదెకరాల్లో పండించిన పంటను కోయగా సుమారు 280 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వచ్చింది. దాని విలువ సుమారు రూ.ఏడు లక్షలు ఉంటుంది. ఆ ధాన్యంను స్థానిక ఎన్‌హెచ్-365 రోడ్డుపై ఆరబోశారు. కాగా, గురువారం ఉదయం ఆరు గంటలకు రోడ్డు పక్కనున్న మిషన్ భగీరథ పైపు లైన్ ఎయిర్‌వాల్స్ వద్ద ఒక్కసారిగా లీకేజీ కావడంతో ధాన్యం నీటిలో కొట్టుకుపోయి కాలువ పాలైంది. కొంత ధాన్యం తడిసి ముద్దయింది. బాధిత రైతులను విచారించగా మిషన్ భగీరథ అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే ఏయిర్‌వాల్స్ వద్ద లీకేజీ జరిగిందని తెలిపారు. అనంతరం నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేపట్టారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని బాధిత రైతులను పరామర్శించారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని, నష్టపోయిన బాధిత రైతులను అందుకొని ప్రభుత్వం తరపున నష్టపరిహారాన్నీ అందిస్తామని భరోసానిచ్చారు. ఎమ్మెల్యే వెంట ఒడిసిఎంఎస్ ఛైర్మెన్ రామస్వామి నాయక్, ఎంపిపి వేములపల్లి ప్రకాష్ రావు, మండల అధ్యక్షులు మహాలక్ష్మి వెంకట రామనరసయ్య, బోడపూలు, శాఖమూరి హరిబాబు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు ఉన్నారు.

ఒయు పిహెచ్‌డి ప్రవేశ పరీక్షలు ప్రారంభం

తొమ్మిదేళ్ల తర్వాత నిర్వహణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉస్మానియా యూనివర్సిటీలో పిహెచ్‌డి ప్రవేశపరీక్షలను ఒయు విసి ప్రొఫెసర్ రవిందర్ యాదవ్ గురువారం ప్రారంభించారు. పరీక్షల పాస్‌వర్డ్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొమ్మిదేళ్ల విరామం తర్వాత ఉస్మానియా యూనివర్సిటీ పిహెచ్‌డి ప్రవేశాలు నిర్వహిస్తోందని తెలిపారు. పిహెచ్‌డి అడ్మిషన్లలో కేటగిరీ సీట్లను ఈ ప్రవేశ పరీక్ష ద్వారా భర్తీ చేయనున్నట్టు చెప్పారు. ఓయూలో ఆయా విభాగాల్లో పీహెచ్‌డీ ప్రవేశం కోసం 9, 976 మంది విద్యార్థులు పోటీ పడుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒయు రిజిస్ట్రార్ ప్రొ. పిపి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలి : టిఎస్‌యుటిఎఫ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నూతన పెన్షన్ విదానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సామ మల్లారెడ్డి అన్నారు. గురువారం దేశవ్యాప్తంగా జరుగుతున్న జీపుజాతాలో భాగంగా టిఎస్ యుటిఎఫ్ డోర్నకల్ మండల శాఖ ఆధ్వర్యంలో జీపు జాతాకు ములకలపల్లి ఉన్నత పాఠశాలలో ఘన స్వాగతం పలికారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలంలోని పలు పాఠశాలలను సందర్శించిన అనంతరం కన్నేగుండ్ల, డోర్నకల్ ఉన్నత పాఠశాలల్లో ఆయన మాట్లాడారు. నూతన విధ్యా విధానం-2020లోని లోపాలను సవరించాలని కోరారు. ఈ మేరకు దేశ వ్యాప్తంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టి రాష్ట్రపతికి అందించనున్నామన్నారు. ఎస్‌టిఎఫ్ఐ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా పోరాటాలకు సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. జాతాలో జిల్లా కార్యదర్శి నామ వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు వివేక్, మండల అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్ అజీజ్, శివ ప్రసాద్, సీనియర్ జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

న్యూ కామన్వెల్త్ ఛాంపియన్‌షిప్‌లో మెరిసిన మల్లిక

పవర్ లిఫ్టింగ్‌లో ఏకంగా నాలుగు స్వర్ణాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో


మల్లిక

న్యూ కామన్వెల్త్ ఛాంపియన్‌షిప్-2022 ఛాంపియన్‌షిప్ పవర్ లిఫ్టింగ్‌లో రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌కు చెందిన మహిళ మెరిసింది. న్యూజిలాండ్ ఆక్లాండ్‌లో జరిగిన న్యూ కామన్వెల్త్ ఛాంపియన్‌షిప్-2022లో శంషాబాద్ గబ్బర్ ఫిట్నెస్ జిమ్‌కు చెందిన మల్లిక పవర్ లిఫ్టింగ్‌లో 84 కిలోల మహిళా కేటగిరిలో పాల్గొని ఏకంగా నాలుగు స్వర్ణాలు సాధించి చరిత్ర సృష్టించింది. 236 కిలోల విభాగంలో బ్యాక్ స్కాట్, వంద కేజీల విభాగంలో బెంచ్ ప్రెస్, 215.5 కేజీల విభాగంలో డెడ్ లిఫ్టులో పాల్గొని నాలుగు స్వర్ణ పతకాలు సాధించింది. మొత్తం 552.5 కిలోల బరువు ఎత్తి న్యూ కామన్వెల్త్ ఛాంపియన్‌గా నిలిచి స్ట్రాంగ్ ఉమెన్ టైటిల్‌ని సాధించింది. 2015 నుంచి 2022 సంవత్సరం వరకు రాష్ట్రంలో పవర్ లిఫ్టింగ్‌లో నాలుగు గోల్డ్ మెడల్స్ సాధించిన మహిళగా మల్లిక నిలిచింది. మై హొమ్ సిమెంట్ ప్రయివేటు లిమిటెడ్ స్పాన్సర్ షిప్, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సహకారంతో ఈ టోర్నీలో పాల్గొంది. ఆసియన్ స్ట్రాంగ్ మెన్ శంషాబాద్ గబ్బర్ ఫిట్నెస్ జిమ్ యజమాని ఏ. రాఘవేందర్ గౌడ్ ప్రోత్సాహంతో అనేక పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొంటూ వస్తోంది. న్యూ కామన్వెల్త్ ఛాంపియన్ షిప్‌లో పతకాలు సాధించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ఎఐకెఎస్ మహాసభ సందర్భంగా...

5న రైతు అమరవీరుల జ్యోతి యాత్ర

- కడివెండి నుంచి కేరళలోని త్రిసూర్ దాకా కొనసాగింపు
- పోస్టర్‌ను ఆవిష్కరించిన నేతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేరళలోని త్రిసూర్‌లో ఈ నెల 13 నుంచి 16 వరకు అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) మహాసభల కొనసాగనున్న నేపథ్యంలో... జనగామ జిల్లాలోని కడివెండి నుంచి రైతు అమరవీరుల జ్యోతి యాత్రను ప్రారంభిస్తామని ఎఐకెఎస్ నేతలు తెలిపారు. ఈనెల ఐదున ఆరంభం కానున్న ఈ యాత్ర త్రిసూర్ వరకూ కొనసాగుతుందని వారు వివరించారు. యాత్రను జయప్రదం చేయాలని ఈ సందర్భంగా రాష్ట్ర రైతాంగానికి పిలుపునిచ్చారు. సంబంధిత వాల్ పోస్టర్‌ను ఎఐకెఎస్ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జూలకంటి రంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి తీగల సాగర్ గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మహాసభల నేపథ్యంలో దేశంలోని రెండు ప్రాంతాల నుంచి అమర వీరుల జ్యోతి యాత్రలను ప్రారంభించబోతున్నామని తెలిపారు. ఇందులో ఒకటి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య స్వగ్రామమైన కడవెండి నుంచి ఆరంభం కావటమనేది స్ఫూర్తిదాయకమని అన్నారు. ప్రస్తుత వ్యవసాయ రంగ దుస్థితి, దాని అనుబంధ రంగాలు ఎదుర్కొంటున్న సమస్యలతోపాటు కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల రైతుల ఆత్మహత్యలు, వారి ఇబ్బందులు తదితరాంశాలపై మహాసభల్లో చర్చించి, కార్యాచరణను రూపొందిస్తామని వివరించారు. పోస్టర్ ఆవిష్కరణలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ అరిబండి ప్రసాదరావు, పెసరకాయల జంగారెడ్డి, సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, రాష్ట్ర నాయకులు బొంతల చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాత్ర షెడ్యూల్...

డిసెంబర్ 5న

- ఉదయం 10 గంటలు -కడివెండి గ్రామం (జనగాం జిల్లా)
- మధ్యాహ్నం ఒంటి గంట- రామన్నపేట (యాదాద్రి భువనగిరి జిల్లా)
- మధ్యాహ్నం రెండు గంటలు- గుండ్రాంపల్లి (నల్లగొండ జిల్లా)
- మధ్యాహ్నం 3.30 గంటలు -నల్లగొండ
- సాయంత్రం 5.30 గంటలకు మిర్యాలగూడ మీదుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చేరుకుంటుంది.

రైతుపై విత్తన భారం

- నాణ్యమైన విత్తు కరువే
- పడిపోతున్న ఉత్పత్తి
- అంతా ప్రైవేటే...
- ❖ చేతులెత్తేసిన విత్తనాభివృద్ధి సంస్థ



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విత్తనాభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించకపోవంతో అన్నదాతపై విపరీతమైన విత్తన భారం పడుతున్నది. నాణ్యమైన విత్తనాలను రైతులకు అందడం లేదు. విత్తనం ఉత్పత్తి చేసే రైతులకు సరైన ప్రోత్సహకాలు ప్రకటించకపోవడంతో లేకపోవడంతో విత్తనోత్పత్తి నుంచి వారు వెనక్కిపోతున్నారు. ఫలితంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో నాణ్యమైన విత్తనాలు రైతులకు దొరకడం లేదు. మరోవైపు విత్తన ఉత్పత్తి పడిపోతోంది. మేలురకం విత్తనాలను అందుబాటులోకి తేవడంలో ప్రభుత్వం విఫలమవుతోంది. దీంతో రైతులు ఎక్కువ పైసలు పెట్టి ప్రైవేటు కంపెనీల విత్తనాలనే కొనుక్కోవాల్సి వస్తోంది. రాష్ట్రం విత్తన భాండాగారమంటూ గొప్పలు చెప్పుకోవడమే తప్ప ఆ దిశగా తగిన చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికే బహిరంగ మార్కెట్‌లో ఇబ్బడిముబ్బడిగా విత్తన ప్యాకెట్లు దొరుకుతున్నాయి. వివిధ కంపెనీల పేరుతో విచ్చలవిడిగా ప్రయివేటు కంపెనీలు పుట్టుకొస్తున్నాయి. వాటిపైన్నే రైతులు ఆధారపడాల్సి వస్తోంది. మరోవైపుల వేరుశనగ, హైబ్రిడ్ మక్కజొన్న, హైబ్రిడ్ వరి, కూరగాయలు, ఫాదర్ సీడ్ ప్రొడక్షన్, జొన్న, సజ్జ, రాగులు వంటి పంటలకు విత్తనాల ఉత్పత్తి లేకుండాపోయింది.

కార్పొరేట్ రక్షణ కోసమే ఇస్టా

విత్తనాల అభివృద్ధి, ఉత్పత్తిలో సీడ్ కార్పొరేషన్ విఫలం కావడంతో ఆ సంస్థ ఆర్థిక పరిస్థితీ దయనీయంగా మారింది. గతంలో ప్రభుత్వంపై ఆధారపడే పరిస్థితి ఉండేది కాదు. కానీ ఉత్పత్తిలో చేతులెత్తేయడంతో ఆ సంస్థ ఆదాయం పోవడంతో ఇప్పుడు ఆ సంస్థ ఉద్యోగులకు జీతాలు ఇచ్చే పరిస్థితి కూడా లేదు. సీడ్ సర్టిఫికేషన్, సీడ్ ప్రొడక్షన్, సీరీసెర్చ్, సీడ్ క్వాలిటీపై పర్యవేక్షణ లేకుండాపోయింది. వాటికి తగిన నిధులూ లేవు. కరీంనగర్‌లోని సీడ్ టెస్టింగ్ ల్యాబును సద్వినియోగం చేసుకోవడంలో విత్తనాభివృద్ధి సంస్థ విఫలమవుతున్నది. ఇంటర్నేషనల్ సీడ్ టెస్టింగ్ అసోసియేషన్ (ఇస్టా) అధ్యక్షులుగా రాష్ట్రానికి చెందిన అధికారి ఎన్నికైనట్టు గొప్పలు చెప్పుకుంటున్నా అది కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల రక్షణ కోసమే పని చేస్తుండడం ఆవేదన కలిగిస్తోంది. ప్రభుత్వం వైపు నుంచి విత్తనోత్పత్తికి ఎలాంటి సహకరం లేదు. దీంతో ప్రయివేటు కంపెనీలు అక్రమ దందాలతో వేల కోట్లకు పడగలెత్తుతుండగా ప్రభుత్వ రంగ సంస్థ మాత్రం దీనావస్థలో కొట్టుమిట్టాడుతోంది.

తగిన విత్తనోత్పత్తి

ప్రస్తుతం వానాకాలంలో 75వేల ఎకరాల్లో వేయాల్సిన సర్టిఫైడ్ వరిసీడ్ గణనీయంగా మూడో వంతుకు పడిపోయింది. గత సీజన్లో కేవలం 25 వేల ఎకరాల్లోనే సర్టిఫైడ్ సీడ్ సాగైంది. ఇక పప్పు దినుసుల్లో పెసర్లు, కందులు, పప్పు శనగ సీడ్ ప్రొడక్షన్ కూడా భారీగా తగ్గిపోయింది. ఇక రాష్ట్రంలోని పరిస్థితుల కారణంగా విత్తన ఉత్పత్తిదారులు పక్క రాష్ట్రాలైన చత్తీస్‌గఢ్, కర్ణాటకకు తరలిపోతున్నారు. గతంలో దేశంలోని రాష్ట్రాల ఇంటర్నేషనల్ సీడ్ సర్టిఫికేషన్ ప్రక్రియ తెలంగాణ సీడ్ సర్టిఫికేషన్ ఆథారిటీ పరిధిలో ఉండేవి. అయితే, పరిపాలన వైఫల్యం వల్ల ఇప్పటికే ఆయా రాష్ట్రాలు మన నుంచి వైదొలిగాయి. ఇప్పుడు మన రాష్ట్రంతోపాటు చత్తీస్‌గఢ్ మాత్రమే ఆ అధికారంలో కొనసాగుతోంది. ఈ క్రమంలో ప్రచార్భాటం తప్పితే ఇది రైతులకు ఉపయోగం లేని సంస్థగా మారింది. సీడ్ విత్తనాలపై పారదర్శకంగా ఉండేందుకు పొందుపరచాల్సిన క్యూఆర్ కోడింగ్, సీడ్ సర్టిఫికేషన్, సీడ్ తనిఖీ యాక్టివిటీ వంటివి చేపట్టడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

నిస్తేజంలో ' సీడ్ కార్పొరేషన్'

ఇప్పటికే ప్రత్యామ్నాయ పంటలు వేయాలనుకున్న రైతులకు సీడ్ కార్పొరేషన్ విత్తనాలు అందించే స్థితిలో మాత్రం లేదనే విమర్శలు ఎదుర్కొంది. అలాగే రాష్ట్రంలో ఏటా సీడ్ ప్రొడక్షన్ గణనీయంగా పడిపోతోంది. మూడు కిలోలు ఉండే ఆర్ఎక్స్ వంద బ్యాగుకు రూ.900 ధర పలుకుతోంది. వ్యాపారులు ఒక్కో దగ్గర ఒక్కోలా రూ. 1800 నుంచి రూ.3.600 వరకూ బ్లాక్‌లో అమ్ముకుంటున్నారు. ఎకరానికి ఆరు నుంచి తొమ్మిది కిలోల సీడ్స్ అవసరం కావడంతో విత్తనాలకే రైతులు భారీగా పెట్టుబడి పెట్టాల్సి వస్తున్నది. దీంతో ప్రతీ సీజన్‌లోనూ విత్తనాలు సమయానికి అందక సీడ్ సర్టిఫికేషన్ లేని ప్రయివేటు కంపెనీలను రైతులు ఆశ్రయించాల్సిన దుస్థితి కొనసాగుతోంది.

కార్పొరేట్ గుప్పిట్లో విత్తన రంగం

విత్తనరంగం మొత్తం పెద్ద పెద్ద కార్పొరేట్ సంస్థల గుప్పిట్లో కొనసాగుతున్నది. రాష్ట్ర ప్రభుత్వం విత్తన రైతులను ప్రోత్సహించడం లేదు. స్థానికంగా మేలు రకాలు ఉత్పత్తి చేసి రైతులకు అందించాలి. విత్తన పరిశోధనలకు నిధులు కేటాయించకుండా ఆయా సంస్థలను నిర్వీర్యం చేస్తున్నది. ఇదే ఇప్పుడు రైతులకు ఇబ్బందికరంగా కార్పొరేట్లకు వరంగా మారింది. ఈ విషయంలో వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకుని రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉండాలి.

టి సాగర్,
ప్రధాన కార్యదర్శి తెలంగాణ రైతు సంఘం

ప్రకటన
మహారాజశ్రీ కాకినాడ 4వ జిల్లా జడ్జివారి కోర్టు
A.S. No. 62/2017
Between:
శ్రీమతి సైరా సుల్తానా ...అప్పిలెంట్
మరియు
మహమ్మద్ కరీముల్లా షా ఖాదిర్ జిలానీ (Died) వగైరాలు ...రెస్పాండెంట్లు
Respondent 3 :
మహమ్మద్ మహబూబ్ పాషా
S/o. (లేటు) మహమ్మద్ కరీముల్లా షా ఖాదిర్ జిలానీ ఫ్లాట్ నెం. 101, డో.నెం. 17-1-391/6 శ్రీసాయి ఎన్‌క్లేవ్, సుబ్రహ్మణ్య నగర్, సైదాబాద్ కాలనీ, హైదరాబాద్ - 500059
పై నెంబరు అప్పీల్‌లో మీరు 3వ రెస్పాండెంట్ అయి ఉన్నారు. మీకు శ్రీ కోర్టువారి ద్వారా పై నెంబరు అప్పీల్‌లో ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకముగా కాలయాపన చేయుచున్నారు. పై నెంబరు అప్పీల్ **ది. 13-12-2022** తేదీనకు వాయిదా అయి ఉన్నది. కావున పైన తెలిపిన 3వ రెస్పాండెంట్ అయిన మీరు పై తేదీన పైన తెలిపిన కోర్టులో **ఉదయం గం. 10-30 ని॥లకు** హాజరై ఆక్షేపణలు తెలియపరచుకోవలెను. లేని యెడల పై అప్పీల్ తమ పరోక్షమున తీర్మానము చేయబడునని ఇందుమూలముగా తెలియపరచడమైనది.
|| By Court Order ||
కాకర వెంకటేశ్వరరావు, అడ్వకేట్
#12-1-40, జవహర్ వీధి, కాకినాడ.
Ph: 0884-2367503, Cell: 9848314081

మహారాజ శ్రీ కర్నూలు ఏడవ అదనపు జిల్లా జడ్జి గారి కోర్టులో
M.V.O.P No. 110/2021
జంగం చంద్రయ్య మరియు ఇతరులు. ...అర్జీదారులు
-Vs-
బందు సాయి భరత్ వగైరా. ...రెస్పాండెంట్లు
1వ రెస్పాండెంటుకు నోటీసులు
బందు సాయి భరత్ తండ్రి బందు శ్రీనివాసరావు , కారు డ్రైవర్, కారు.నెం.T.S.11 ES 6131, ఇంటి నెం. 18-13-9/P/20, పటేల్ నగర్, బండ్లగూడ, చాంద్రాయణ గుట్ట, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం.
పై నెంబరు M.V.O.P లో జె.హరిత అను అమె రోడ్డు ప్రమాదములో చనిపోయినందున అమె వారసులు అయిన అర్జీదారులకు నష్టపరిహారము కోరుతు అర్జీదాఖలు చేసినారు. ఇందులో 1వ రెస్పాండెంటు అయిన నీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 9-12-2022 వ తేది ఉదయం 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
తేది : 9-12-2022
కెంగార కుమార్,
అర్జీదారుల పరం న్యాయవాది
కర్నూలు.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE CUM JUDICIAL FIRST CLASS MAGISTRATE AT PUTTUR
I.A. NO. 544/2021
O.S. NO. 117/2021
Between:
T.S. Vanisree ... Plaintiff
And:
1. Chevireddy Munireddy Rosamma infro Pvt.Ltd., Rep.by its chairman Chevireddy Harshith Reddy and 8 Others ... Defendants
NOTICE TO THE RESPONDENTS NO.2 TO 5 BY WAY OF PAPER PUBLICATION
To
1. Nadella Ananda Naidu S/o. Late N. Munaswamy Naidu (R2)
2. Dr. Nadella Urvasi D/o. N. Ananda Naidu (R3)
3. Nadella Harini D/o. N. Ananda Naidu (R4)
4. Nadella Tejeswini D/o. N. Ananda Naidu (R5)
The Respondents No.2 to 5 residing at D.No. 6-200, Silpa Paradise, Pragati Nagar, Hyderabad-500090, Telangana State.
Please take notice that the above suit filed against the defendants, for declaration and permanent injunction over the plaint schedule properties, by the Plaintiff and also filed a petition in I.A.No. 544/2021 for temporary injunction same is posted to 30-12-2022, for your appearance. If you have got any objections you may appear before the Hon'ble Principal Junior Civil Judges Court, Puttur at 10.30 A.M. on 30-12-2022, either in person or through an Advocate and file your objections, if you fail to appear on that day, the matter will be decided exparte.
Sri Gali Ramesh, B.Com., B.L.,
Smt. D.C. Prema, LL.M.,
Sri N. Nadhamuni, LL.B.,
Kum S. Nadiya, B.Com., LL.B.,
Sri P. Lakshmi Narayana, B.A., B.L.,
Advocates, Puttur.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE CUM JUDICIAL FIRST CLASS MAGISTRATE AT PUTTUR
O.S. NO. 117/2021
Between:
T.S. Vanisree ... Plaintiff
And:
1. Chevireddy Munireddy Rosamma infro Pvt.Ltd., Rep.by its chairman Chevireddy Harshith Reddy and 8 Others ... Defendants
SUIT SUMMON TO THE DEFENDANTS NO.2 TO 5 BY WAY OF PAPER PUBLICATION
To
1. Nadella Ananda Naidu S/o. Late N. Munaswamy Naidu (D2)
2. Dr. Nadella Urvasi D/o. N. Ananda Naidu (D3)
3. Nadella Harini D/o. N. Ananda Naidu (D4)
4. Nadella Tejeswini D/o. N. Ananda Naidu (D5)
The Defendants No.2 to 5 residing at D.No. 6-200, Silpa Paradise, Pragati Nagar, Hyderabad-500090, Telangana State.
Please take summons that the above suit filed against the Defendants, for declaration and permanent injunction over the plaint schedule properties, by the Plaintiff same is posted to 30-12-2022, for your appearance. If you have got any objections you may appear before the above said Court at 10.30 A.M. on 30-12-2022, either in person or through an Advocate and file your objections, if you fail to appear on that day, the matter will be decided exparte.
Sri Gali Ramesh, B.Com., B.L.,
Smt. D.C. Prema, LL.M.,
Sri N. Nadhamuni, LL.B.,
Kum S. Nadiya, B.Com., LL.B.,
Sri P. Lakshmi Narayana, B.A., B.L.,
Advocates, Puttur.

IN THE COURT OF HON'BLE IX ADDI CHIEF JUDGE CITY CIVIL COURT AT:HYDERABAD
O.P.NO.1596 OF 2019
BETWEEN:
Pedda Golla Anjaneyulu and Others. ....Petitioner
AND
Mohammad Saleem and Others. ....Respondent
To,
1.MohammadSaleem,S/o. Md.Moinuddin, Occ:Owner of Vehicle DCM No.TS 12 UB 8490,R/o.H.No.2-36/1,Suraram Colony, Quthubullapur, Medchal, T.S. R1
2.Tajuddin Mohd. S/o. Shareuddin, Occ: Driver of DCM No.TS 12 UB 8490, R/o. H.No.1-57/A, Malchalma, Zaheera bad, Medak. R3
3.Abdul Razak Soudhager,S/o.Mohd Masood Soudhager,Occ:Owner of Lorry No.AP 28 TB 6065,R/o.H.No. 3-2-103, Kummargally, Thandur,Telagana. K4
Please take Notice that the above named Petitioner filed above O P against you and other for Compensation, Praying that the Hon'ble court for grant of compensation in favor of the petitioner. The Hon'ble Court posted the above case on **6-12-2022.** at **10.30** am for your appearance either in person or through an Advocate, failing which the case will be heard and decided on merits in your absence.
(BY ORDER OF COURT)
RAVI KRISHNA KUMAR,
Advocate
Near Yashoda Hospital,
Malakpet,Hyderabad

మునుగోడు అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

ఉమ్మడి నల్లగొండ జిల్లాకు రూ.1544 కోట్లు

చండూర్ రెవిన్యూ డివిజన్‌గా త్వరలో ఏర్పాటు : కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రజలను గుండెల్లో పెట్టుకుంటాం.. వారికి పూర్తి అండగా ఉంటామని ఐటీ పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. మునుగోడు మండల కేంద్రంలో మంత్రులు, ఉమ్మడి జిల్లా అధికారులతో గురువారం ఉమ్మడి జిల్లా అభివృద్ధి సంక్షేమ సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు.

ఉమ్మడి జిల్లాలో ప్రజలకు అన్ని విధాలుగా అండగా ఉండి సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను సమిష్టి బాధ్యతగా తీసుకొని ఏడాదిలో పనులు పూర్తిచేసి వచ్చే ఎన్నికల్లో ముందుకు వెళ్తామని చెప్పారు. రాబోయే ఆరేడు నెలల్లో ఆర్‌అండ్‌బి, పిఆర్, మున్సిపల్, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో రూ.1544కోట్లను 12 నియోజకవర్గాల్లో ఖర్చు చేయబోతున్నట్టు ప్రకటించారు. తెలంగాణ దిక్సూచిగా సిఎం కెసిఆర్ నల్లగొండ, సూర్యాపేటలో మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేశారని చెప్పారు. వరి సాగులో దేశంలో తెలంగాణ రెండో స్థానంలో ఉంటే, తెలంగాణలో నల్లగొండ జిల్లా మొదటి స్థానంలో ఉందని తెలిపారు.

రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో ఆరేడు నెలల్లో రూ.402 కోట్లు ఖర్చు చేసి రోడ్లు వేస్తామన్నారు. అలాగే, పంచాయతీరాజ్ శాఖ తరపున రూ.700 కోట్లు, మున్సిపల్ శాఖ తరపున 19 మున్సిపాలిటీల పరిధిలో రూ.334 కోట్లు ఖర్చు చేయడంతో పాటు అదనంగా గ్రాంట్స్ ఇస్తామని చెప్పారు. గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో తండాల్లో రోడ్ల మరమ్మతులకు రూ.వంద కోట్లు ఖర్చు చేస్తామన్నారు. ప్రత్యేకంగా మునుగోడు నియోజకవర్గంలో రూ.వంద కోట్లతో రహదారులు, రూ.175 కోట్లతో పంచాయతీరాజ్ శాఖ ద్వారా అభివృద్ధి, చండూరు మున్సిపాలిటీకి రూ.30 కోట్లు, చౌటుప్పల్ మున్సిపాలిటీకి రూ.50 కోట్లు మంజూరు చేసినట్టు తెలిపారు. మునుగోడు నియోజకవర్గంలో ఐదు కొత్త సబ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. అందుకు రూ. ఎనిమిది కోట్లు విడుదల చేస్తున్నామన్నారు. ఉప ఎన్నికల్లో ముఖ్యమంత్రి కెసిఆర్ హామీ ఇచ్చినట్టుగా మునుగోడు నియోజకవర్గంలో వంద పడకల ఆస్పత్రి ఏర్పాటు చేస్తామన్నారు. దండు మల్కాపూర్ ఇండస్ట్రియల్ పార్కులో టై పార్క్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ పార్కుతో పదివేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. త్వరలో చండూరును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తామని చెప్పారు. నారాయణపురం మండలంలో గిరిజన గురుకుల పాఠశాల ఏర్పాటు చేస్తామన్నారు. మునుగోడు నియోజకవర్గంలో మూడు హ్యాండ్లూమ్ క్లస్టర్‌లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. మునుగోడులో కూచికుంట్ల ప్రభాకర్ రెడ్డిని గెలిపించిన ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని తెలిపారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, రహదారులు, భవనాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, మహిళా, శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, రాజ్యసభ ఎంపి బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

వక్ఫ్ ఆస్తుల రక్షణ బాధ్యత ప్రభుత్వానిదే..

- **ఇన్సాఫ్ జాతీయ అధ్యక్షులు, మాజీ ఎంపి అజీజ్ పాషా**

ధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎంపి అజీజ్ పాషా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో వక్ఫ్ ఆస్తులను రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని ఇన్సాఫ్ జాతీయ అధ్యక్షులు, మాజీ ఎంపి అజీజ్ పాషా అన్నారు. వక్ఫ్ భూములను రక్షించేందుకు ఎండోమెంట్ తరహాలో వక్ఫ్ బోర్డుకు న్యాయపరమైన అధికారాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత తంజీమ్ -ఏ- ఇన్సాఫ్, దక్కన్ వక్ఫ్ ప్రొటెక్షన్ సొసైటీ, అఖిల భారత ఆవాజ్ కమిటీ, అఖిల భారత ముస్లిం మైనారిటీ సంస్థలు సంయుక్తంగా ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద గురువారం ధర్నా నిర్వహించాయి. ఈ సందర్భంగా అజీజ్ పాషా మాట్లాడుతూ.. వక్ఫ్ బోర్డులో దశాబ్దాలుగా అవినీతి, దుర్వినియోగం, అవకతవకల కారణంగా రాష్ట్రంలో హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో విలువైన వక్ఫ్ ఆస్తుల ధ్వంసం, భారీ ఎత్తున భూముల ఆక్రమణ జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అవకతవకలపై టిఆర్ఎస్ ప్రభుత్వం సిఐడి విచారణ మరింత వేగవంతం చేయాల్సిన అవసరముందన్నారు. కోట్లాది రూపాయల విలువైన 80 శాతంపైగా వక్ఫ్ భూములు ఇప్పటికే భూమాఫియా కబంధహస్తాల్లోకి చేరాయని, వక్ఫ్ బోర్డుకు న్యాయపరమైన అధికారాలు లేనందున ఈ ఆక్రమణలను తొలగించే పరిస్థితి లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ దేవాదాయ శాఖకు న్యాయపరమైన అధికారాలు కల్పించినట్టుగా తెలంగాణ వక్ఫ్ బోర్డుకూ న్యాయపరమైన అధికారాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

ఈ ధర్నాలో అఖిల భారత మైనారిటీ సంస్థల సలహాదారులు ఎంఎ సిద్ధికి, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి ఉస్మాన్ ఆల్ హాజీరి, ఆవాజ్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి ఎండి అలీ, అఖిల భారత మైనారిటీ సంస్థల అధ్యక్షుడు ముఖ్తర్ హుస్సేన్, సంఘ సేవకురాలు డా. నస్రీన్ సుల్తానా, ప్రొఫెసర్ అన్వార్ ఖాన్ తదితరులు హాజరయ్యారు.

పేద విద్యార్థులకు ఎ కేటగిరిలో దరఖాస్తుకు అవకాశం కల్పించాలి

తెలంగాణ మెడికల్ స్టూడెంట్స్ పేరెంట్స్ అసోసియేషన్ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మెడికల్ అడ్మిషన్లలో మేనేజ్‌మెంట్ కోటా (బి కేటగిరి)లో సీటు సాధించిన పేద విద్యార్థులకు ఎ కేటగిరిలో దరఖాస్తు చేసుకునే అవకాశం ఇవ్వాలని తెలంగాణ మెడికల్ స్టూడెంట్స్ పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. నీట్‌లో మంచి ర్యాంకు వచ్చినా ఎస్‌సి,ఎస్‌టి,బిసి విద్యార్థులు ఎ కేటగిరిలో దరఖాస్తు చేసుకోలేదని వారికి మరో అవకాశం కల్పించాలని అసోసియేషన్ అధ్యక్షులు రాయల సతీష్ బాబు, ప్రధాన కార్యదర్శి ఇ చంద్రశేఖర్, ముఖ్య సలహాదారు దాసరి రవిప్రసాద్ కాళోజీ వైద్య విశ్వవిద్యాలయ అధికారులను కోరారు. మేనేజ్‌మెంట్ కోటాలో స్థానిక విద్యార్థులకు లోకల్ రిజర్వేషన్ కల్పిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఈ విద్యాసంవత్సరం అనేకమంది తెలంగాణ విద్యార్థులకు మెడిసిన్ చదివే అవకాశం వచ్చిందని వారు గుర్తుచేశారు. ప్రైవేటు మెడికల్ కళాశాలలు నాలుగున్నర సంవత్సరాలకే ఫీజు తీసుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

7, 8 తేదీల్లో పిడిఎస్‌యు రాష్ట్ర మహాసభలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పిడిఎస్‌యు రాష్ట్ర 22వ మహాసభలు ఈ నెల ఏడు, ఎనిమిది తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి గురువారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. అన్ని వర్గాల విద్యార్థులు పాల్గొని ఈ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విద్యారంగంలోని సమస్యలతోపాటు సమాజంలోని అంతరాలపై కొట్లాడాలని సూచించారు. కులం, మతం, స్త్రీ-పురుష వివక్షత, పేద, ధనికుల మధ్య అంతరాల్లేని సమాజం కోసం కృషి చేయాలని వివరించారు. విద్యార్థులు రాజకీయ చైతన్యంతోపాటు సామాజిక స్పృహ కలిగి ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ నాగేశ్వరరావు, బోయిన్‌పల్లి రాము, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ అనిల్, కె ప్రవీణ్, ఉపాధ్యక్షుడు ఎన్ సుమంత్, సహాయ కార్యదర్శి ఎస్ రాకేష్, నిజాం కళాశాల కమిటీ ఉపాధ్యక్షుడు తిరుపతి, నాయకులు హర్ష, కళ్యాణ్, ఎస్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టిపిసి రామగుండం ప్లాంట్‌లో

రెండు స్టీమ్ టర్బైన్ల ఆధునీకరణ

జిఇ స్టీమ్ పవర్, ఎన్‌జిఎస్‌ఎల్ వెల్లడి

ప్రజాశక్తి-హైదరాబాద్

ఎన్‌టిపిసి రామగుండం సూపర్ థర్మల్ పవర్ స్టేషన్‌లోని 1, 3 యూనిట్‌లను ఆధునీకరించినట్లు జిఇ పవర్ ఇండియా లిమిటెడ్ (జిఇపిఐఎల్), ఎన్‌జిఎస్‌ఎల్ కన్సార్టియంలోని దాని అనుబంధ సంస్థలు తెలిపాయి. యూనిట్ 1, 3కి టర్బైన్ హీట్ రేట్‌లో సగటు 9.9 శాతం మెరుగుదల, టర్బైన్ జీవితకాలం 20 సంవత్సరాలు పొడిగింపు, రెండు యూనిట్ల థర్మల్ సామర్థ్యంలో సగటు ప్లస్ 3.8% పాయింట్ల మెరుగుదలకు స్టీమ్ టర్బైన్ అప్‌గ్రేడ్ ప్రాజెక్ట్ తోడ్పడిందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. అప్‌గ్రేడ్ చేయబడిన యూనిట్లు పవర్ ప్లాంట్ కోసం బొగ్గు వినియోగంలో సంవత్సరానికి 2.12 లక్షల మెట్రిక్ టన్ను సంభావ్య వార్షిక పొదుపునకు మద్దతును ఇవ్వనున్నాయి. ప్రాజెక్ట్ ప్రాంతానికి సంబంధించి 2.34 లక్షల మెట్రిక్ టన్ను/సంవత్సరానికి కార్బన్‌డైఆక్సైడ్‌ను ఉద్గారాలను తగ్గిస్తోంది. ఈ యూనిట్లు నికర జీరో 2070 ప్రభుత్వ లక్ష్యసాధనకు అనుగుణంగా ఉండనున్నాయని జిఇ పవర్ ఇండియా లిమిటెడ్ ఎండి ప్రశాంత్ జైన్ తెలిపారు. రెండు యూనిట్ల నుండి ఉత్పత్తి చేయబడిన అదనపు 20 మెగావాట్ల ఉత్పత్తి సుమారు 44,100 భారతీయ గృహాలకు విద్యుత్తును అందిస్తుందని అంచనా.

ఇక్కడ దోపిడీ సరిపోక ఢిల్లీలో లిక్కర్ వ్యాపారం

దీనిపై ప్రజలకు సమాధానం చెప్పాలి : ఈటెల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇక్కడ దోపిడీ సరిపోదన్నట్టుగా ఢిల్లీకి పోయి లిక్కర్ వ్యాపారం చేయాల్సిన అవసరం ఏమొచ్చిందో రాష్ట్ర ప్రజలకు కవిత సమాధానం చెప్పాలని బిజెపి ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ధరణి పేరిట వేలాది ఎకరాల భూములను చరబట్టి, పేదల భూములను మాయం చేసి వేల కోట్ల రూపాయలు సంపాదించారని విమర్శించారు. ఆ డబ్బులను తమలాంటి వారిని ఓడగొట్టడానికి వాడడం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. 2014 వరకు అటుకులు బుక్కి, ఉపాసముండి, ఉద్యమాలు నడిపామని కెసిఆర్ చెప్పేవారని తెలిపారు. అలాంటి పార్టీకి ఎనిమిదేండ్ల కాలంలో వేల కోట్ల రూపాయలు ఎలా వచ్చాయో తెలంగాణ ప్రజలు ఆలోచించాలని కోరారు. ఏ పార్టీకి కూడా సొంత హెలికాప్టర్లు, విమానాలు లేవనీ, టిఆర్ఎస్‌కు దాన్ని కొనే స్తోమత ఎక్కడ నుంచి వచ్చిందని నిలదీశారు.

మంచి పనులు చేసే వారిని సమాజం విస్మరించదు

- **రాష్ట్ర హోం మంత్రి మహమూద్ అలీ**

ప్రజాశక్తి - కల్చరల్

పలు సామాజిక సేవా కార్యక్రమాలకు సహకరిస్తూ దళితుల శ్రేయస్సు ను కాంక్షిస్తూ, ఆదర్శ ప్రాయ జీవితం గడుపుతున్న కె.కె.రాజా ఈశ్వరీ బాయి పురస్కారం కు అర్హుడని రాష్ట్ర హోమ్ మంత్రి మహమూద్ అలీ అభినందించారు. మంచి పనులు చేసే వారిని సమాజం మరువదని చెప్పారు. రవీంద్రభారతి ప్రధాన వేదిక పై గురువారం తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, ఈశ్వరీ బాయి స్మారక నిధి నిర్వహణ లో ఈశ్వరీబాయి 104 వ జయంతి సందర్భంగా సామాజిక కార్యకర్త కె.కె.రాజా కు 2022 ఈశ్వరీ బాయి స్మారక పురస్కార ప్రదానోత్సవం భిన్న రంగాల ప్రముఖుల సమక్షం లో వైభవంగా జరిగింది. ముఖ్య అతిథిగా మహమూద్ అలీ పాల్గొని పురస్కరం బహుకరించి మాట్లాడారు. ఈశ్వరీ బాయి పేద దళిత వర్గాల ప్రతినిధి గా సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ లొ వారి హక్కుల కోసం గళమెత్తరని గుర్తు చేశారు. తెలంగాణ ప్రాతం వివక్షత కు వ్యతిరేకంగా ఉద్యమించారని అన్నారు. తెలంగాణ రాష్ట్రం లో ఈశ్వరి బాయి ఆశయాలకు అనుగుణంగా ముఖ్య మంత్రి కే.సి.ఆర్ పని చేస్తున్నా రని దళిత బంధు వంటి పథకాలు దేశం లో మరెక్కడా లేవని అన్నారు. అధ్యక్షత వహించిన ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కే.వీ.రమణ మాట్లాడుతూ ఈశ్వరి బాయి ధీర మహిళ ఆమె వారసత్వాన్ని గీతా రెడ్డి పునికి పుచ్చు కున్నారని అన్నారు. రాజా జీవితం ఆదర్శ ప్రాయం అన్నారు బుద్ధవనం ప్రేత్యేక అధికారి మల్లెపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ ఈశ్వరి బాయి ఎట్టి రాజకీయ ప్రభావాలు లేకుండా దళిత ఉద్యమం నడిపారని నేడు అట్టి మరో ఉద్యమం అవసరం ఉందన్నారు. బడుగు బలహీన వర్గాల పిల్లలకు గురుకుల విద్యాలయాల కోసం తొలిసారిగా పోరాటం చేసిన ఈశ్వరి బాయి పురస్కరం సౌమ్యుడు ఆచరణ సాధ్యం కాని వి ఆచరించి చూపే సత్తా ఉన్న రాజా కు బహు కరించటం సముచితం గా వుందన్నారు. వేదిక పై దళిత్ నాయకుడు జె. బి రాజు, రాంచంద్ర రెడ్డి, తది తరులు పాల్గొన్నారు. ట్రస్ట్ స్థాపకురాలు డాక్టర్ గీతా రెడ్డి నివేదిక సమర్పించగా సంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ స్వాగతం పలికారు.

సికింద్రాబాద్‌లో ఓలా ఇవి ఎక్స్‌పీరియన్స్ సెంటర్

ప్రజాశక్తి-హైదరాబాద్

ఓలా ఎలక్ట్రిక్ విస్తరణలో భాగంగా సికింద్రాబాద్‌లో తన తొలి ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రకటించింది. బెగంపేటలో ఉన్న ఈ కొత్త కేంద్రంలో అన్ని రకాల ఓలా ఇవి సేవలు లభ్యమవుతాయని పేర్కొంది. ఒకే చోట అన్ని సేవలను అందించాలనే లక్ష్యంతో దీన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. ఓలా వినియోగదారులను ఎస్1, ఎస్1 ప్రొ టెస్ట్ రైడ్స్ తీసుకోడానికి, బ్రాండ్ ఛాంపియన్స్ నుండి కొనడానికి సహాయాన్ని అడగడానికి, ఫైనాన్సింగ్ ఎంపికల పై వివరాలు పొందడానికి తమ సిబ్బంది సాయం చేయనున్నారని పేర్కొంది.

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇడిగా ఎంవి మురళీ కృష్ణ

హైదరాబాద్ : సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఎంవి మురళీ కృష్ణ బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఆయన బ్యాంక్ ఆఫ్ బరోడాలో చీఫ్ జనరల్ మేనేజర్‌గా పని చేశారు. బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్‌లో ఎంబిఎ పూర్తి చేసిన మురళీ కృష్ణ బిఒబిలో ప్రొబేషనరీ ఆఫీసర్‌గా కేరీర్‌ను ప్రారంభించారు. ఆ బ్యాంక్‌లో వివిధ హోదాల్లో పని చేసిన విస్తృత అనుభవం కలిగి ఉన్నారు.

ఎస్‌ఎన్‌డిపి పనులు పూర్తిచేసేందుకు అధికారుల కసరత్తు

- **డిసెంబర్ పూర్తయ్యేసరికి 90శాతం పనులు**
- **రూ.985 కోట్లతో 56 నాలా పనులు**

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రేటర్ హైదరాబాద్‌లో లోతట్టు ప్రాంతాలను భారీ వర్షాలు, వరద ముప్పు నుంచి రక్షించేందుకు ప్రభుత్వం చేపట్టిన ఎస్‌ఎన్‌డిపి పనులను వచ్చే మార్చి నాటికి పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. 2020లో భారీ వర్షాలు, వరదలతో అతలాకుతలమైన విషయం తెలిసిందే. హైదరాబాద్ చరిత్రలో ఎప్పుడు ఎన్నడూ కురవని వర్షాలు ఆ ఏడాది కురవడంతో లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్ట్రాటజిక్ నాలా డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎస్‌ఎన్‌డిపి) ద్వారా నాలా అభివృద్ధి పనులు, బాక్స్ డ్రెయినేజీ పనులు, చెరువులకు సంబంధించిన లింకులు వంటి పనులు చేపట్టారు. ప్రజల ఇబ్బందులను శాశ్వతంగా తొలగించేందుకు నిధులు సమకూర్చి జిహెచ్‌ఎంసి పనులను ప్రారంభించిన నేపథ్యంలో ఒక్కొక్క పని యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేసి రానున్న వర్ష కాలంలో లోతట్టు ప్రాంత ప్రజలకు వరద ముప్పు బెడద లేకుండా మెరుగైన వసతులు కల్పించాలన్నదే ప్రధాన ఉద్దేశం. అందులో భాగంగానే ఈ ఏడాది డిసెంబర్ నాటికి 90 శాతం పనులు, వచ్చే ఏడాది మార్చి నాటికి వంద శాతం పనులను పూర్తిచేయాలని జిహెచ్‌ఎంసి నిర్ణయించింది. ఫలితంగానే ఒక్కో పనిని అధికారులు పూర్తిచేసుకుంటూ వస్తున్నారు.

రూ.985కోట్లతో ..

ఎస్‌ఎన్‌డిపి ద్వారా రూ.985 కోట్లతో 60 పనులు ప్రతిపాదించగా అందులో 37 పనులు జిహెచ్‌ఎంసి పరిధిలోకాగా మిగతా 23 పనులు జిహెచ్‌ఎంసి చుట్టూ ఉన్న మున్సిపాల్టీల్లో ప్రతిపాదించారు. అందులో జిహెచ్‌ఎంసి పరిధిలో రూ.737.45కోట్లతో 35 పనులు చేపట్టారు. ఇతర మునిసిపాల్టీల్లో రూ.248 కోట్లతో 21 పనులు, మొత్తం 56 పనులు చేపట్టారు. జిహెచ్‌ఎంసి పరిధిలో చేపట్టిన పనుల్లో రూ.7.26 కోట్లతో బండ్లగూడ చెరువు నుంచి నాగోల్ చెరువు బాక్స్ డ్రెయిన్ నిర్మాణం పూర్తితో ఎస్‌ఎన్‌డిపి ద్వారా చేపట్టిన రెండో పని పూర్తయింది. ఇంతకు ముందు సనత్‌నగర్ నియోజకవర్గం బేగంపేట సర్కిల్ పికెట్ నాలాపై రూ.పది కోట్లతో చేపట్టిన బ్రిడ్జి పనులతో అక్టోబర్ నెలలో అందుబాటులోకి వచ్చి మొట్టమొదటి ప్రాజెక్టు ప్రారంభమైన విషయం తెలిసిందే. బండ్లగూడ చెరువు నుంచి నాగోల్ చెరువు వరకు చేపట్టిన పనిపూర్తి కావడంతో అనేక కాలనీలకు వరద ముంపు సమస్య తీరనుంది. జిహెచ్‌ఎంసి ప్రజల అవసరాలను గుర్తించి వాటిని యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేందుకు క్రియాశీలకంగా వ్యవహరిస్తుంది.

90శాతం పనులు

డిసెంబర్ ఆఖరి నాటికి 90 శాతం పనులు పూర్తిచేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎస్‌ఎన్‌డిపి ద్వారా చేపట్టిన 35 పనులల్లో ఇప్పటి వరకు రెండు పనులు పూర్తికాగా, డిసెంబర్ చివరి వరకు సుమారు 32 పనులు పూర్తి చేసి మిగిలిన పనులన్నింటినీ మార్చి చివరి వరకు చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇతర మునిసిపాల్టీల్లో రూ.248 కోట్లతో చేపట్టిన 21 పనుల్లో ఒక పని పూర్తయింది. మరో 16 పనులు డిసెంబర్ వరకు, నాలుగు పనులు వచ్చే సంవత్సరం మార్చి వరకు పూర్తి చేయనున్నారు.

బండ్లగూడ చెరువు వద్ద కాలనీలు

పార్టీ జెండా.. ఎజెండా.. పేదలే

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు జి నాగయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పేదలందరూ ఎర్ర కండువాలు, ఎర్ర చీరలు, ధరించి సిపిఎం జెండా ఎగరవేయడం ఆనందంగా ఉందని, పార్టీ జెండా.. ఎజెండా పేదల పక్షాన పోరాడటమేనని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు జి నాగయ్య స్పష్టంచేశారు. వరంగల్ జిల్లా మామునూరులోని రంగసాయి పేట సిపిఎం శాఖ కార్యదర్శి వెంకటలక్ష్మి అధ్యక్షతన వరంగల్ జిల్లా కార్యదర్శి చింతమల్ల రంగయ్యతో కలిసి నాగయ్య పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మామునూరు గడ్డమీద ఎర్రజెండా ఎగుర వేయడానికి వేలాదిమంది పేదలు కలిసికట్టుగా రావడం అభినందనీయమన్నారు. పేదల న్యాయమైన హక్కుల సాధన కోసం ఎర్రజెండా చేత పట్టుకొని సిపిఎంలో చేరడం శుభపరిణామమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాల కారణంగా పేదలు విలవిలలాడుతున్నారన్నారు. కొన్ని సంస్థలు దేశమంతా నిర్వహించిన సర్వేలో ఆకలి పెరుగుదలలో పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, కంటే భారతదేశం అధ్వాన పరిస్థితిలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలు రక్తహీనతతో బలహీనంగా పుడుతూ చిన్న వయసులోనే ప్రాణాలు వదులుతున్నారని, ప్రభుత్వాల కారణంగా ఆకలి చావులు అధికమయ్యాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 40 వేల మంది పేద ప్రజలు ఇల్లు లేక గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారని, వారందరికీ 120 గజాల స్థలం ఇచ్చి పట్టాలివ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జక్కలొద్దీలో 296 ఎకరాల సీలింగ్ భూమిలో 50 ఎకరాల్లో పేదలు గుడిసెలు వేసుకున్నారని, మిగతా 250 ఎకరాల సీలింగ్ భూమి ఎవరి చేతుల్లో ఉందో కలెక్టర్, ఆర్‌డిఒ, స్థానిక తహసీల్దార్లు ఎందుకు గుర్తించలేకబోతున్నారని ప్రశ్నించారు. పెద్దలు కబ్జా చేసిన భూములను వదిలి పేదలు వేసుకొన్న గుడిసెల జోలికి రావడం, వారిని బెదిరించడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకొని ఉంటున్న పేదలందరికీ పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి చింతమల్ల రంగయ్య మాట్లాడుతూ.. తెలంగాణ వచ్చి ఎనిమిదేళ్లు గడిచిపోతున్నా సిఎం కెసిఆర్ ఎ ఒక్కరికి సొంతింటి కల నెరవేర్చలేదని విమర్శించారు. దాంతో పేదలు ఎదురుచూపులు చూడలేక సిపిఎం అండతో భూ పోరాటాలు చేస్తూ ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకొని ఉంటున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇకనైనా పేదలకు న్యాయం చేయాలని అన్నారు. రంగసాయిపేట ఏరియా కార్యదర్శి మాలోతు సాగర్ మాట్లాడుతూ సిపిఎం భూ పోరాటాల్లో పేద ప్రజల భాగస్వామ్యం ఎంతో గొప్పదని పార్టీ పేదల పక్షాన పోరాడటాన్ని చూసి మామునూరులోని ప్రజలు పెద్ద ఎత్తున చేరడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని అన్నారు. కార్యక్రమంలో రంగశాపేట ఏరియా కమిటీ సభ్యులు మాలోతు ప్రత్యూష, రత్నం, గణపక ఒదేలు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సాంబమూర్తి, ప్రజానాట్యమండలి అధ్యక్ష కార్యదర్శులు దుర్గయ్య, అనిల్, సోషల్ మీడియా కార్యదర్శి గజ్జ చందు, ప్రజా సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అదనపు కట్నం తేవాలని అత్తింటి వారు వేధింపులకు గురి చేయడంతో వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం మృతి చెందింది. ఎస్ఐ ఇమ్మడి వీరభద్రరావు తెలిపిన వివరాల ప్రకారం.. జోగంపల్లి గ్రామానికి చెందిన కౌటం ప్రభాకర్ చిన్న కుమార్తె పల్లబోయిన అనుషను పరకాల మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన పల్లబోయిన ధర్మతేజతో ఏడు నెలల కిందట వివాహం జరిపించారు. వివాహ సమయంలో కట్న కానుకలు, ఇతర లాంఛనాలు ఇచ్చి ఘనంగా పెళ్లి చేశారు. నెల రోజులపాటు సంసారం సాఫీగానే కొనసాగింది. తర్వాత భర్త, అత్త అన్నపూర్ణ, మామ సాంబయ్య, ఆడబిడ్డలు రేవతి, గౌతమి, మరిది సుధీర్‌కుమార్.. ఈ ఆరుగురు వ్యక్తులు అదనపు కట్నం తేవాలని అనుషను మానసికంగా, శారీరకంగా వేధించేవారు. ఈ విషయంలో పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ జరగగా అత్తింటి వారిని మందలించారు. అయినప్పటికీ వారిలో మార్పు రాకపోగా అదనపు కట్నం కోసం మరింతగా వేధిస్తుండటంతో ప్రభాకర్ తన కూతుర్ని రెండు నెలల కిందట స్వగ్రామానికి తీసుకువచ్చాడు. అయినప్పటికీ అత్తింటివారు అనూషకు ఫోన్లు చేస్తూ వేధింపులకు గురి చేయడంతో మానసికంగా కృంగిపోయి గత నెల 22న సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నది. గమనించిన కుటుంబ సభ్యులు హనుమకొండలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. కాగా చికిత్స పొందుతున్న అనూష గురువారం మరణించింది. అనుష తండ్రి ప్రభాకర్ ఫిర్యాదు మేరకు ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి పరకాల ఎసిపి శివరామయ్య దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

శక్తివంత సాధనంగా వాట్సప్ కమ్యూనిటీలు : నిక్ క్లెగ్

న్యూఢిల్లీ : ఇటీవల తాము అందుబాటులోకి తెచ్చిన వాట్సప్ కమ్యూనిటీ ఫీచర్ సామాజికంగా శక్తివంతమైన సాధనంగా మారనుందని మెటా గ్లోబల్ అఫైర్స్ ప్రెసిడెంట్ నిక్ క్లెగ్ పేర్కొన్నారు. ఆయన భారత పర్యటన సందర్భంగా వాట్సాప్ కమ్యూనిటీ బిల్డర్స్ ప్రోగ్రామ్‌లోని నాయకులతో, కమ్యూనిటీల ఇమ్మర్షన్ పేరిట నిర్వహించిన కార్యక్రమంలో నిక్ క్లెగ్ పాల్గొని మాట్లాడారు. ఇటీవల ప్రారంభించిన 'కమ్యూనిటీస్ ఆన్ వాట్సాప్' ఫీచర్ సంస్థలకు ఎలా సహకారాన్ని అందిస్తుందో చర్చించారు. దేశవ్యాప్తంగా సామాజిక ప్రభావాన్ని పెంచే తమ ఉమ్మడి లక్ష్యంలో మెరుగైన అనుసంధానం, వ్యవస్థీకత మార్పునకు ఆ ఫీచర్ అందించే సహకారాన్ని ఆయన వివరించారు. సరళమైన, విశ్వసనీయమైన, సురక్షితమైన ఈ వేదికతో కమ్యూనిటీలు తమ గ్రూపు సంభాషణలను ఒకే గొడుగు క్రింద నిర్వహించుకో గలుగుతాయన్నారు.

భారత్‌కు రికార్డ్ రెమిటెన్స్‌లు

ప్రపంచ బ్యాంక్ అంచనా

వాషింగ్టన్ : ప్రస్తుత ఏడాదిలో విదేశాల్లోని భారత ప్రవాసీలు దేశానికి భారీగా రెమిటెన్స్‌లు పంపనున్నారని ప్రపంచ బ్యాంక్ అంచనా వేసింది. ఈ ఏడాది రెమిటెన్స్‌ల విలువ 12 శాతం పెరిగి 100 బిలియన్ డాలర్లకు (దాదాపు రూ.81 వేల కోట్లు) చేరుతుందని ఆ నివేదిక పేర్కొంది. అమెరికా, బ్రిటన్, సింగపూర్‌లోని ప్రవాసి ఉద్యోగులు ఈ ఏడాది పెద్ద ఎత్తున నిధులు పంపనున్నారని తెలిపింది. తక్కువ వేతనాలు ఉండే గల్ఫ్ వంటి దేశాల నుంచి భారత్‌కు చెందిన ప్రవాసులు గత కొన్నేళ్లుగా అధిక వేతనాలిచ్చే బ్రిటన్, సింగపూర్, అమెరికా దేశాలకు వెళ్లిపోతున్నారని వెల్లడించింది. ఆయా దేశాల్లో వేతనాల పెంపునకు తోడు డాలర్‌తో రూపాయి మారకం విలువ పడిపోవడం కూడా రెమిటెన్స్‌లు పెరగడానికి ప్రధాన కారణమని ప్రపంచ బ్యాంక్ విశ్లేషించింది.

మెడిక్స్‌తో టాటా ఎఐఎ లైఫ్ భాగస్వామ్యం

ముంబయి : ప్రయివేటు రంగం లోని జీవిత బీమా సంస్థ టాటా ఎఐఎ లైఫ్ ఇన్సూరెన్స్ (టాటా ఎఐఎ) అంతర్జాతీయ కంపెనీ మెడిక్స్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు ప్రకటించింది. "ఈ భాగస్వామ్యంతో టాటా ఎఐఎ యొక్క వినియోగదారులు స్థానిక, అంతర్జాతీయ వైద్య నిపుణుల సలహాలతో అతి తీవ్రమైన అనారోగ్య సమస్యలను నిర్వహించుకోగలరు. ఈ సేవలను అర్హత కలిగిన జీవిత బీమా పాలసీలను టర్మ్, సేవింగ్స్, పెన్షన్ ప్లాన్ పాలసీదారులకు కాంప్లిమెంటరీగా అందిస్తారు. మెడిక్స్‌తో భాగస్వామ్యం ద్వారా మేము మా విలువ ప్రతిపాదనను మరింత వద్ధి చేసుకోవాల నుకుంటున్నాము." టాటా ఎఐఎ ఎండి, సిఇఒ నవీన్ తహిల్యానీ పేర్కొన్నారు.

బుక్ మై ఫారెక్స్ నుంచి ఇంటర్‌బ్యాంక్ రేట్ ఫారెక్స్ కార్డ్

న్యూఢిల్లీ : దేశంలోనే తొలి ఆన్‌లైన్ ఫారిన్ ఎక్స్చేంజ్ మార్కెట్ ప్లేస్ అయినా బుక్ మై ఫారెక్స్ డాట్ కామ్ కొత్తగా ఇంటర్ బ్యాంక్ రేట్ మల్టీ కరెన్సీ ఫారెక్స్ కార్డును విడుదల చేసినట్లు ప్రకటించింది. ఇది భారత్‌లోనే తొలి ట్రూజీరో మార్కప్ ట్రావెల్‌కార్డ్ అని పేర్కొంది. దీంతో ఇంటర్నేషనల్ ప్రయాణికులు ఇంటర్‌బ్యాంక్ రేట్ల వద్ద జీరో యాడెడ్ మార్కప్‌తో కొనుగోలు చేయవచ్చని పేర్కొంది. అంటే సెర్చ్ ఇంజిన్‌ల వద్ద కనిపించే ప్రత్యక్ష, వాస్తవ రేట్లను పొందవచ్చని తెలిపింది. సాధారణంగా బ్యాంకులు జారీ చేసే క్రెడిట్, డెబిట్ కార్డులపై చేసే విదేశీ లావాదేవీలపై 5 శాతం పైగా ఇంటర్‌బ్యాంక్ రేట్లను బ్యాంకులు వసూలు చేస్తుంటాయి.